ఉత్సాహంగా అ'పూర్వ' సంగమం

విశాలాంధ్ర-దేవరపల్లి: స్నేహితులందరూ తమ చదువుకున్న స్కూల్లో కలుసు కోవడం ఎంతో ఆనందం ఉత్సాహంగా ఉందని అలనాటి స్నేహి తులు తమ చదువుకున్న స్కూల్లో ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు అలాగే ఆనాటి గురువులను కూడా ఘనంగా సత్కరించి జ్ఞాపకాలు అందజేశారు. 1986-1987లో 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం దేవరపల్లి అంబటి సత్యనారాయణ రావు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉల్లాసంగా ఉత్సాహంగా నిర్వహించారు. ఒక చోట చేరుకుని ఒకరికొకరు పరిచయాలు చేసుకొని తాము ఏ వృత్తుల్లో ఉన్నాము పిల్లలు ఏం చదువుతున్నారు ఎవరు ఏ రంగంలో ఉన్నారు ఒకరికొకరు అడిగి తెలుసుకున్నారు. అలనాటి విద్యార్థులు కూచిపూడి సతీష్ మద్దిపాటి శ్రీనివాస్ తీగల సురేష్ నాగు నిమ్మగడ్డ వెంకటేశ్వరావు నాగప్రభ లక్ష్మి సీత వెంకటరమణ రమాదేవి దుర్గ సిర్ర కృపారావు ప్రతిపాటి బాబురావు కూచిపూడి కృష్ణారావు విద్యార్థులు అలనాటి పూర్వ విద్యార్థులు గురువులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా సత్తి వెంకటరెడ్డి

విశాలాంధ్ర-అనపర్తి: అనపర్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా రెండోసారి సత్తి వెంకట రెడ్డి (విశాలాంధ్ర)ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనపర్తి వర్తక సంఘ భవనంలో ప్రెస్‌క్లబ్ సర్వసభ్య సమావేశం జరగ్గా ఈ సమా వేశంలో గౌరవ అధ్యక్షులుగా సత్తి శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యక్షులు జీపీవీ అమరేంద్రబాబు, కార్యదర్శి కర్రి నాగేశ్వర్ రెడ్డి, సం యుక్త కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి మల్లిడి సత్తిరెడ్డి, సహాయ కోశాధికారి పడాల నాగిరెడ్డి, ముఖ్య సలహాదారులు సత్తి ఆదిరెడ్డి, లీగల్ అడ్వై జర్ అడబాల శ్రీరామ్, కార్యవర్గ సభ్యులు కొవ్వూరి నాగ శ్రీనివాసరెడ్డి, పడాల సత్యనారాయణ రెడ్డి, సత్తి అరుణ్ కుమార్ రెడ్డి,డి లోకేంద్ర,సత్తిప్రదీప్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీనియర్ పాత్రికేయులు చింతా వీర్రాఘవరెడ్డి ఎన్ని కల అధికారిగా వ్యవహరించారు. ఇంకా సభ్యులు సబ్బెళ్ళ ఆదిత్య రెడ్డి, గొలుగూరి అనిల్ శేఖర్ రెడ్డి, భువనేష్ మధు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో సత్తా చాటిన శ్రీమహతి

విశాలాంధ్ర-సీతానగరం: ట్రిపుల్ ఐటీలో శ్రీమహతికి చెందిన విద్యార్థులు సీట్లు సాధించారు. ఈ సందర్భంగా పాటశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ ప్రతిష్టాతమకమైన ఐ ఐ ఐ టీలో మంచి ర్యాంకులు సాధించి కృష్ణా నందన్, షైను, పాతూరి వెంకటేష్ అనే ముగ్గురు విద్యార్థులు అర్ జె యు కె టి ఒంగోలులో సీట్లు సాధించారని అన్నారు. మంచి ర్యాంకులు పొందిన విద్యార్థులు అందరూ ఐ ఐ టీ, ఎన్ ఈ ఈ టీ తీసుకున్న వారేనే అని ఐ ఐ టి అకాడమిక్ డైరెక్టర్ ఏ ఎస్ రాం ప్రసాద్ తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పాటశాల మేనేజ్మెంట్ అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు ప్రశంస

విశాలాంధ్ర-ఉండ్రాజవరం: మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన, ఇద్దరు విద్యార్థులు శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి విశ్వప్రసాద్ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. మంచిగంటి బాల దుర్గా శిరీష, పోతా బత్తుల ఆనంద గోపాల్ లు మండల కేంద్రం ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023, పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితం సాధించి, ట్రిపుల్ ఐటీ లో సీటు సాధించడం మండలానికి గర్వకారణమన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు బూరుగుపల్లి సుబ్బారావు మాట్లాడుతూ మరింతమంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని, ఈ విద్యార్థులు వారికి స్ఫూర్తిగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎం.వెంకట్రావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎస్.సోమేశ్వరావు, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు.

రామకృష్ణ కుటుంబానికి అండగా ఉంటాం

విశాలాంధ్ర-కొవ్వూరు: కొవ్వూరు మండలం నందమూరు గ్రామానికి చెందిన మారిన రామ కృష్ణ, సూర్యచంద్రం కుటుంబ సభ్యులను రాష్ట్ర హోంమంత్రి, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత ఆదివారం పరామర్శించారు. నందమూరు గ్రామంలో రామకృష్ణ, సూర్య చంద్రంల స్వగృహానికి హోంమంత్రి వెళ్లి వారి తల్లి మారిన బంగారమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటీవల బంగారమ్మ వృద్ధాప్యం కారణంగా మృతి చెందారు. వారి కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉంటామని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుంకర సత్యనారాయణ, ఉప్పులూరి సూరిబాబు, మద్దిపాటి సురేష్, శ్రీరంగం సత్యప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన యాకూ బేబీ వల్లి

విశాలాంధ్ర-గోకవరం: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించినప్పటి నుండి పార్టీకి, జగన్ కు వీరాభిమానిగా ఉంటున్న షేక్ వల్లి ఎప్పటినుండో తన అభిమాన నాయకుడు వైయస్ జగన్ ను కలవాలంటూ కలలు కంటున్నానని, శనివారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్ ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందని ఇన్నాళ్లకు నా కల నెరవేరిందని గోకవరం స్థానిక డ్రైవర్స్ కాలనీ ప్రభుత్వ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ షేక్ యాకూబీబీ వల్లి తెలియజేస్తూ ఆయన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యా వ్యవస్థలో జగన్ తీసుకువచ్చిన అభివృద్ధి దేశ చరిత్రలో నిలిచిపోతుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

జనసేన ఇన్‌చార్జిగా బలరాం

విశాలాంధ్ర-రాజానగరం/సీతానగరం: రాజానగరం నియోజకవర్గ జనసేన పార్టీ పగ్గాలను బత్తుల బలరామ కృష్ణ అందుకున్నారు. నియోజకవర్గంలో ఎక్కడో ఉన్న పార్టీని గత కొంతకాలంగా తనదైన శైలిలో గ్రామ గ్రామాల్లో సంచరించి,అధికార పార్టీకి ప్రధాన ప్రతిపక్షంగా ఉండడం,పార్టీ శ్రేణుల్లో జోష్ నిప్పడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటు సహాయ సహకారాలు అందిస్తున్న బత్తుల సేవలను గుర్తించిన జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పేరిట ఈ మేరకు లేఖను ఆదివారం విడుదల చేశారు. ఇంచార్జీ పదవి ఒక ఏడాది పాటు వుంటుందని తదుపరి పొడిగింపు వుంటుందని లేఖలో వున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా శ్రీ కృష్ణ పట్నం గ్రామ సర్పంచ్ కిమిడి శ్రీరామ్, పార్టీ నాయకులు గళ్ళ రంగ,తదితరులు బత్తుల బలరామకృష్ణనీ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పోరాడి ఉద్యోగాలు సాధించుకోవాలి

విశాలాంధ్ర-రాజమండ్రి: స్థానిక సిపిఐ కార్యాలయములో ఏఐవైఫ్ సమావేశము ఆదివారము చినబాబు అధ్యక్షతన జరిగింది. ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అధికారంలోకి రాగానే ఖాళీగా ఉన్న 2 30 000 ఉద్యోగాలు భర్తీ చేస్తామని మాట ఇచ్చి మోసం చేయొద్దని ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ భర్తీ చేయాల్సిందేనని అనారు.వైసీపీ అధికారంలోకి రాగానే ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేస్తామని అందుకోసం ప్రతి సంవత్సరం జనవరిలో ఉద్యోగ ప్రకటనల కాలపట్టిక (జాబ్ క్యాలెండర్) ప్రకటిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పారు కానీ ఈ నాలుగేళ్ల కాలంలో ఎన్ని జాబ్ క్యాలెండర్లు ఇచ్చారో , ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారో తెల్ల కాగితంపై రాసి ఇవ్వాలన్నారు. అధికారంలోకి వచ్చాక గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగాలు, కరోనా కాలంలో వైద్య శాఖ లో కొన్ని, అరకొర ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు పద్ధతిలో కొన్ని అవి కూడా అధికార పార్టీ నాయకులకు అమ్ముకున్నారన్నారు. ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ అభ్యర్థులకు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని, పశు సంవర్ధక శాఖా లోని అనిమల్ హస్బండరి అసిస్టెంట్స్ ఉద్యోగాలు భర్తీ చేయాలని,ఏపీపీఎస్సీ గ్రూప్ 1,2, మరియు 4 తోపాటు వివిధ శాఖల లోని ఖాళీలను భర్తీ చేయాలని, మెగా డీఎస్సీ విడుదల చేసి ఖాళీగా ఉన్న 55 వేల ఉపాధ్యాయ , కళల నైపుణ్యత , సంగీత ఉపాధ్యాయులు ఉద్యోగాలూ భర్తీ చేయాలని, గ్రామ వార్డు సచివాలయాలలో ఖాళీగా ఉన్న 20వేల ఉద్యోగాలు భర్తీ చేయాలని,కళాశాలల, విశ్వవిద్యాలయ అధ్యాపక ఉద్యోగాలు భర్తీ చేయాలని,వివిధ శాఖలలోని ఇంజనీరింగ్ ఉద్యోగాలు భర్తీ చేయాలని ప్రాథమిక (ప్రిలిమ్స్) ప్రధాన (మెయిన్స్) పరీక్ష విధానం రద్దుచేసి ఒకే పరీక్ష నిర్వహించాలి ,నెగిటివ్ మార్క్ లు పెట్టవద్దనీ, ఏపీపీఎస్సీ మరియు ఇతర ఉద్యోగ నియామక పరీక్షల ప్రశ్న పత్రాలు తెలుగును ప్రామాణికం చేసుకొని తయారు చేయాలని, వయోపరిమితి 45 సంవత్సరాలకు పెంచాలి, ప్రతి జిల్లాలో ప్రభుత్వ శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ లతో ధర్నా చేపట్టారు. రాష్ట్రంలోని ఖాళీ ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయకపోతే తిరుగుబాటు తప్పదని ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. అనంతరం ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్‌గా కె శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సమావేశములో సీపీఐ నగర కార్యదర్శి వీ కొండలరావు , ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి సునీల్, యూత్ నాయకులూ రమేష్ పాల్గొన్నారు.

కూరగాయలు, నిత్యావసరాల ధరలు తగ్గించాలి

విశాలాంధ్ర-గోకవరం: పెరిగిన కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రజలు గోకవరం మండలం, రంప ఎర్రంపాలెం గ్రామంలో నిరసన ధర్నా నిర్వహించారు.అధిక ధరలు తగ్గించాలని నినదించారు. ఏ.పీ. ఆర్. సి .ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, డివిజన్ కార్యదర్శి దేశెట్టి సురేష్, పి డి ఎస్ యు కార్యదర్శి పి శ్రీకాంత్, గోలి ముసలయ్య, వడ్లపాటి చంద్రమ్మ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యంపై ప్రజల్లో మార్పు రావాలి

విశాలాంధ్ర-రాజానగరం: అర్హులైన పేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే పిడిఎస్ బియ్యం పై ప్రజల్లో మార్పు రావాలనీ అందుకు సరైన అవగాహన కల్పించాలని రాష్ట్ర పౌరసరఫరాలు శాఖ కమీషనర్ హెచ్.అరుణ్ కుమార్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని ఎంపిడివో కార్యాలయంలో పిడిఎస్ బియ్యంతో వండిన పలు రకాల వంటకాలు పై ఆదివారం జరిగిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పౌర సరఫరాల కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ మాట్లాడుతూ పిడిఎస్ బియ్యాన్ని పక్కదారి పట్టించి సొమ్ములు చేసుకుంటున్న మాఫియా పై శాఖ పరమైన చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రజల్లో మార్పు రావాలని అప్పుడే పిడిఎస్ సన్మార్గంలో వినియోగం జరుగుతాయని ఆశా భావం వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవిలత, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ ప్రసంగించారు. పీడీఎస్ బియ్యంతో పలు రకాల వంటలు నిర్వహించిన వారిలో విజేతలగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఆర్డీవో ఏ.చైత్ర వర్షిణి, ఇంఛార్జి డిఎస్వో విజయ భాస్కర్, డిఎం మార్కెటింగ్ ఏ.కుమార్, ఎంపిడివో బి.రామారావు,తహశీల్దార్ పవన్ కుమార్,వెలుగు ఏపీఎం కె.హేమ నాగలక్ష్మి,పిడి డిఆర్డిఏ ఎస్. సుభాషిణి, డిఎల్డివో పి.వీణా దేవి పాల్గొన్నారు.

పీజీసెట్‌లో వెంకటేశ్వర విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-అమలాపురం: స్థానిక శ్రీ వెంకటేశ్వరా కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు, నిన్న రాత్రి ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహించిన పిజి సెట్ ఫలితాలలో స్టేట్ టాప్ ర్యాంక్‌లు సాధించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెవిఆర్ఎన్ నరసింహారావు నేడు ఒక ప్రకటనలో తెలిపారు. పిజి సెట్ పీజిక్స్ విభాగంలో చిక్కాల లక్ష్మీ కీర్తి స్టేట్ 9వ ర్యాంక్ సాదించి కోనసీమ కీర్తిని ఇమిడింపచేసినట్లు పేర్కొన్నారు. కళాశాలలో జరిగిన అభినందన సభలో ప్రిన్సిపాల్ కెఎస్‌విఎస్ మనోహర్, ఏఓ కరాటం ప్రవీణ్, చైర్మపర్సన్ మల్లిపూడి విజయ లక్ష్మి, ఆఫీసర్స్ కె శ్రావణ్ దిలీప్, డా కె హేమావిజిత, సీనియర్ లెక్చరర్స్ వై వరప్రసాద్, సిహెచ్. జాన్ పాల్, శ్రీలక్ష్మి, సూర్యకుమారి, సూరిబాబు, పలువురు అధికారులు, ప్రముఖులు జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లా, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, రిజిస్టరర్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

భూ సమస్యలపై నేడు కలెక్టరేట్ ముట్టడి

విశాలాంధ్ర-జగ్గంపేట: మండలంలోని గుర్రంపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో భూ సమస్యలపై సోమ వారం జిల్లా కలెక్టర్ ఆఫీస్‌ను ముట్టడి స్తామని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు తెలిపారు. జగ్గంపేట మండలం రామవరం శివారు రంగ వల్లి నగర్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సమా వేశంలో రైతు కూలి సంఘం సహాయ కార్యదర్శి కే సతీష్, డివిజన్ నాయకులు సురేష్, పిఓడబ్ల్యూ స్త్రీ విముక్తి నాయకురాలు దేవి పాల్గొన్నారు.

లంక ప్రాంతాలను కాపాడండి

విశాలాంధ్ర-ఆలమూరు: అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం బడుగువానిలంక గ్రామంలో గోదావరి కోతకి గురవుతున్న లంక ప్రాంతాలను ఆదివారం సీపీఐ మండల కార్యదర్శి కే రామకృష్ణ, బీఎస్పీ కొత్తపేట నియోజకవర్గ అధ్యక్షులు గుర్రపు కొత్తియ్య పరిశీలించారు. గ్రామ రెవెన్యూ పరిధిలో 1977వ సంవత్సరంలో చుట్టుపక్కల గ్రామాల పేద ప్రజలకు లంక భూములలో(డి)ఫారం పట్టాలు ఇచ్చారన్నారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం లంక భూములు గోదావరి కోతకు గురవుతూ వరదలలో కొట్టుకుపోవడంతో సుమారు 400 కుటుంబాలు భూమిలేని నిరుపేదలుగా ఉన్నారని, అనేక ప్రభుత్వాలు అధికారంలోకి వస్తున్నప్పటికీ ఏ ఒక్క ప్రభుత్వం కూడా వీటిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి భూములు కోతకు గురవకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. త్వరలో సిపిఐ, బిఎస్పి బృందాలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకునివెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని భావిస్తున్నామన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నిర్మాణం

విశాలాంధ్ర-శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో గల మాధురి విద్యాలయానికి శనివారం పంచాయతీ అధికారి నోటీసు జారీ చేశారు. మాధురి విద్యాలయానికి జి ప్లస్ వన్ అనుమతులు ఉండగా జి ప్లస్ టు నిర్మాణం చేపట్టడంతో శనివారం పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి నోటీసు జారీ చేసి పనులు నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భవన నిర్మాణం పై మండల పరిషత్ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు మండల అధికారులు దృష్టికి తీసుకురాగా అనుమతులు ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ స్కూళ్లపై అధికారుల పర్యవేక్షణ ఎంతవరకు ఉన్నది అనేది స్పష్టమవుతోంది.

శంఖవరంలో భారీ అన్నదానం

విశాలాంధ్ర-శంఖవరం: మండల కేంద్రమైన శంఖవరంలో ఆదివారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శంఖవరంలో ప్రతి సంవత్సరం ఆషాడ మాసం పురస్కరించుకొని హాస్టల్ ప్రక్కన గల వ్యాపారం తల్లి ఆలయంలో పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. పంటలు బాగా పండాలని ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ పూజలు చేస్తారు. దీనిలో భాగంగా ఆదివారం వేలాది మందులు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అందరికీ అన్న ప్రసాదం అందే విధంగా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. వ్యాపారమ్మను అధిక సంఖ్యలో మహిళలు దర్శించుకున్నారు.

ట్రిపుల్ ఐటీకి రాజుపాలెం విద్యార్థి

విశాలాంధ్ర-కిర్లంపూడి: శ్రీకాకుళం జిల్లా రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ ట్రిపుల్ ఐటీకి కిర్లంపూడి మండలం రాజు పాలెం గ్రామానికి చెందిన విద్యార్థి గంధం రాజా త్రిలోకేష్ ఎంపికయ్యారు. గంధం రాజా త్రిలోకేష్ పెద్దాపురం మండలం చంద్ర మాంపల్లి లిఖిత పబ్లిక్ స్కూల్లో చదివి ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 600 మార్కులకుగాను 587 మార్కులు సాధించాడు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించడమే కాకుండా ట్రిపుల్ ఐటీకి అర్హత సాధించతో విద్యార్థి ఆనందానికి అవధుల్లేవు. విద్యార్థి తండ్రి విష్ణుమూర్తి వ్యవసాయం చేస్తుండగా, తల్లి లక్ష్మి దేవి లిఖిత పబ్లిక్ స్కూల్లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. త్రిలోకేష్‌ను పాఠశాల కరస్పాండెంట్ బండి వరప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు మంగరాజు, కాటమరాజు. ఉపాధ్యాయ బృందం, పలువురు సిబ్బందితో పాటు, తోటి విద్యార్థులు అభినందించారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర-రాజోలు: రాజోలు రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం ఆదివారం ఘనంగా జరిగింది. దార్ల పాపయ్యాచారి అధ్యక్షత స్థానిక రోటరీ భవనం నందు జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇనస్టలేషన్ అధికారి డాక్టర్ డివిఆర్ పూషా పాల్గొని నూతన కార్యవర్గంచేత ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షునిగా ఏడిద కవీంద్ర, కార్యదర్శిగా చిట్టీనీడి లక్ష్మణరావుతో పాటు నూతన కార్యవర్గ సభ్యులు పదవీ స్వీకారం చేసారు. అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివ కుమార్, లక్కింశెట్టి చిన్మయుడు, కాసు శ్రీను, నామన షణ్ముఖ్, కసుకుర్తి రామకృష్ణ, డాక్టర్ బసవ వరహాలు, బొరుసు తిరుమలరావు, బోళ్ళ శ్రీను, నార్కిడిమిల్లి బాలకృష్ణ, ఐ సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై సూపర్‌ఫైన్, ఫైన్, సాధారణ బియ్యం

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: బహిరంగ మార్కెట్ లో బియ్యం ధరలు పెరిగి నందున రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా రైతు బజార్ల లో సూపర్ ఫైన్ రకం కిలో రూ. 46/- లకు, ఫైన్ రకం కిలో రూ. 40లకు, సాధారణ రకం కిలో రూ.34/- చొప్పున విక్రయించాలని నిర్దేశించిందని రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ హెచ్ అరుణ్ కుమార్ తెలియ చేశారు. ఆదివారం ఉదయం స్థానిక క్వారీ మార్కెట్ సమీపంలో వున్న రైతు బజార్లో బియ్యం అమ్మకం కేంద్రాన్ని కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్ లతో కలిసి ఆయన ప్రారంభించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, జిల్లా పౌర సరఫరాల అధికారి విజయ భాస్కర్, డి ఎం మార్కెటింగ్ ఏ..కుమార్ , మార్కెటింగ్ ఏ డీ ఎమ్.సునీల్ వినయ్, మరియు పౌర సరఫరాల శాఖ అధికారులు, వినియోగ దారులు పాల్గొన్నారు.

ముల్లకలంకకు రాకపోకలు బంద్

విశాలాంధ్ర-సీతానగరం: ముల్లక లంకకు రాకపోకలు బంద్. మండలంలో ఏకైక లంక గ్రామం అయినా ముల్లక లంకకు ఆదివారం నుండి గోదావరి నది ఉధృతి పెరగడంతో బొబ్బిల్లంక, ముల్లకలంక గ్రామాల మధ్య గల గ్రావెల్ రోడ్డు నీట మునిగి పోయింది. దీనితో రెండు గ్రామల మధ్య ఇక పై రాకపోకలు పడవల పై సాగించాలి. ఈ గ్రామానికీ ప్రతీ సంవత్సరం సుమారు రెండు మూడు నెలల పాటు నాటు పడవల పై రవాణా సాగించవల్సి వస్తుంది. దీనికోసం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో సుమారు 35కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణం చేపట్టగా పనులు నత్తనడకన సాగడంతో నేటికీ వంతెన నిర్మాణం పూర్తి కాలేదు అని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీనిపై అధికారులు చర్యలు చేపట్టి త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి ముల్లకలంక గ్రామ ప్రజల వర్షాకాల కష్టాలూ తీర్చాలని కోరుతున్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

కోటసత్తెమ్మ ఆలయం కిటకిట

విశాలాంధ్ర-నిడదవోలు: తిమ్మరాజుపాలెం లో వేంచేసి ఉన్న శ్రీకోటసత్తెమ్మ ను ఆది వారం అత్యధిక భక్తులు దర్శిం చుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారని ఆలయ కార్యనిర్వా హణధికారి బళ్ల నీలకంఠం (శివ) ఒక ప్రకటనలో తెలిపారు.భక్తుల దర్శనార్థమై అమ్మవారికి పత్యేక పూలలంకరణ చేశామన్నారు. భక్తుల ద్వారా రూ 3,00,347 లు ఆదాయంగా లభించినట్లు ఇ ఓ నీలకంఠంతెలిపారు. దర్శనం టిక్కెట్లు ద్వారా రూ 88,800 లు, అన్నదానంవిరాళం రూ 6,057లు,ప్రసాదం అమ్మకం రూ 82,240లు ఇతర టికెట్స్ రూ1,23,250లు మొత్తము రూ 3,00,347లు ఆదాయంగా లభించినట్లు బళ్ల నీలకంఠం తెలిపారు. భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండ ధర్మకర్తల మండలి సభ్యులు అయినీడి వెంకటకృష్ణ, రేలంగి మారుతి శివ భాస్కర రావు, ఊర్ల వీర వెంకట లక్ష్మి, ప్రధాన అర్చకులు ఎస్.వి కె. ఎ.శర్మ తదితరులు పర్యవేక్షించారు.

సచివాలయ భవనం తనిఖీ

విశాలాంధ్ర-గోకవరం: ఆంధ్ర ప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖల ఇంజనీరింగ్ అండ్ చీఫ్ బి బాల నాయక ఆదివారం నాడు గోకవరం మండలంలోని కృష్ణుని పాలెం గోకవరంలోని నూతనంగా నిర్మిస్తున్న సచివా లయము రైతు భరోసా కేంద్రాలను మరియు వైయస్సార్ హెల్త్ క్లినిక్ పనులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. త్వరితగతిన ఈ నిర్మాణ పనులను పూర్తి చేసి సంబంధిత శాఖలకు అప్పగించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా పంచాయతీరాజ్ డిఇ రవి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ రాజమండ్రి ఈ సూర్యనారాయణ పాల్గొన్నారు.

శాకంబరిగా వాసవి అమ్మవారు

విశాలాంధ్ర-అమలాపురం: ఆషాడ మాసం సందర్భంగా అమలాపురం మెయిన్ రోడ్‌లో వేంచేసియున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారు శాకాంబరీ దేవిగా అలంకరింపబడి ఆదివారం ఉదయం నుండి భక్తులకు దర్శనమివ్వనున్నారు. అమ్మవారితో పాటు గర్భాలయము, అంతరాలయము, ఆలయము, ముఖ మండపము వివిధ రకాల కూరగాయలతో అత్యద్భుతంగా అలంకరింప చేయడం జరిగిందని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం, ఉత్సవ కమిటీ వారు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి.. ఐదుగురి అరెస్ట్

విశాలాంధ్ర-జగ్గంపేట: జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలో పేకాట శిబిరంపై పోలిసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. జగ్గంపేట సీఐ బి సూర్య అప్పారావు సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాట్రావులపల్లిలో ఫంక్షన్ పురస్కరించుకొని పేకాట ఆడుతున్నారనే సమాచారంతో తన సిబ్బందితో దాడి చేశామన్నారు. పేకాట ఆడుతున్న ఐదుగురుని అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి 33 వేల 350 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్లను సద్వినియం చేసుకోవాలి

విశాలాంధ్ర-కిర్లంపూడి: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిరుపేదలకు అందిస్తున్న ఉజ్వల ఉచిత గ్యాస్ కనెక్షలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు, జగ్గంపేట అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ కామినేని జయశ్రీ అన్నారు. ఆదివారం కిర్లంపూడి మండలం ముక్కొల్లు గ్రామంలో మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు యడాలి రాంబాబు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అందిస్తున్న ఉజ్వల ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దొడ్డా అప్పారావు పలువురు భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరుపెక్కిన గోదావరి

విశాలాంధ్ర-పిగన్నవరం: ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరి నదికి వరద నీరు రావడంతో పి గన్నవరం మండలంలో గోదా వరి నది ఏరుపెక్కింది. ఈ మేరకు మండలంలోని లంక గ్రామాల ప్రజలు గోదావరి నదిపై రాకపోకలు సాగించేందుకు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న బాటాలు వరద ఉధృతికి కొట్టుకుపోయే అవకాశం ఉంది. తమకు రాక పోకలు సాగించేందుకు నాటు పడవలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉప్పాడలో ఉచిత వైద్య సేవలు

విశాలాంధ్ర-యుకొత్తపల్లి: ఉప్పాడలో ఉచిత వైద్య సేవలు నిర్వహించారు. ఈ సేవలో ఎక్కువ శాతం చర్మం వ్యాధులపై నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో డాక్టర్ చిత్రలేఖ వైద్యులకు పరీక్ష నిర్వహించారు. ఉప్పాడ, అమీనాబాద్, కొత్తపల్లి గ్రామాలలో చర్మవ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా ఓపి చూసి, ఉచితంగా మందులు ఇచ్చారు. పిఎంపి, సూర్య మెడికల్స్ అధినేత కె విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యపరీక్షలు నిర్వహించిన చిత్రలేఖకు విజయ్ కుమార్ అభినందనలు తెలిపారు. అనంతరం రోగులకు ఉచిత మందులు పంపిణీ చేశారు.

రోడ్డు పనుల పరిశీలన

విశాలాంధ్ర-మండపేట: వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో కేశవరం అభివృద్ధి బాటలో నడుస్తుందని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు అన్నారు. గ్రామంలో ఆదివారం ఆంజనేయ స్వామి గుడి ఎదురుగా ఉన్న పల్లపు వీధి రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. గత పదిరోజులుగా ఆ వీధిలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులు పూర్తి కావచ్చాయన్నారు. గ్రామంలోని కొన్ని చోట్ల ఎన్నో ఏళ్ళుగా గ్రావెల్ రోడ్లుగానే ఉంటూ వర్షం వస్తే ఇబ్బందికరంగా ఉండేవన్నారు. అటువంటి రోడ్లన్నీ ఇప్పుడు తోట వచ్చాక సీసీ రోడ్లుగా అభివృద్ధి సాధిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు అన్నందేవుల కృష్ణారారావు, మాజీ ఎంపీటీసీ తుపాకుల ప్రసన్నకుమార్, సచివాలయం కన్వీనర్ అద్దంకి రమణ, శివాలయం కమిటీ చైర్మన్ రాయపాటి సత్యనారాయణ, నున్నా రాంబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తుల అరెస్ట్

విశాలాంధ్ర-ఆత్రేయపురం: మండల కేంద్రంలోనీ మెర్లపాలెం గ్రామంలో పేకాట ఆడు తున్నారన్న, ఆత్రేయపురం పోలీసు స్టేషన్‌కి సమాచారం రావడంతో బివై కిరణ్ ఎస్సై తన స్టేషన్ సిబ్బందితో పేకాట ఆడుతున్న శిబిరంపై మెరుపు దాడి చేయగా పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్దనుండి రూ.1040, 52 ప్లే కార్డ్స్ స్వాధీన చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై బివై కిరణ్ తెలిపారు.

మణిపూర్‌లో దాడులకు నిరసన ర్యాలీ

విశాలాంధ్ర-పిఠాపురం: మణిపూర్‌లో క్రైస్తవులపై చేస్తున్న దాడులకు నిరసనగా ఆంధ్ర బాప్టిస్ట్ సెంటినరీ సంఘం, పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో పిఠాపురంలో ఆర్‌టిసి బస్టాండ్ నుండి ఉప్పాడ బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ కాపర్ల తలలు నరుకుతున్నారని, ప్రభుత్వాలు చొరవ తీసుకొని, రక్షణ కల్పించాలని కోరారు.